కథ

భీమరాజు వెంకటరమణ

# కరుణాకరం

"అందరికీ నమస్కారం! మన అపార్టుమెంట్స్‌లో ఉన్న వారందరం కలిసి రెండు రోజుల్లో రాబోయే కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఒక పార్టీ ఏర్పాటు చేసుకోవాలని మన అసోసియేషన్ నిర్ణయించింది. ముందు రోజు రాత్రి ఎనిమిది గంటల నుండి ఒంటి గంట వరకు ఆటపాటలు, వినోద కార్యక్రమాలుతో పాటు డిన్నర్ కూడా ఏర్పాటు చేయబడుతుంది. పిల్లలు పెద్దలు అందరూ పాల్గొనవచ్చు. ఈ ఏర్పాట్లకుగాను ఫ్లాటు ఒక్కొంటికి ఐదు వందల రూపాయలు చొప్పున వేసుకోవాలి" అని అసోసియేషన్ సెక్రటరీ చెబుతుండగా-

"నాకు పనుంది నేను వెళ్లాలి" అంటూ అక్కడ నుండి వెళ్లిపోయాడు కరుణాకరం.

"అదుగో ఆ ఐదువందలు తప్ప" అన్నారెవరో కరుణాకరాన్ని ఉద్దేశించి. అందరూ నవ్వుకున్నారు.

"అయినా డబ్బు సంగతి ఎత్తగానే వెళ్లిపోతున్నాడు చూడండి" అన్నాడు ఒక పొడవాటి మనిషి.

"అసలు ఆయన్ని మీటింగ్‌కి పిలవడమే తప్పండి! ఇవాళ ఉండి రేపు వెళ్లే టెనెంట్" ఓ బట్టతల పెద్దమనిషి.

"అతగాడి వంతు ఐదు వందలు తగ్గినంత మాత్రాన పార్టీ ఆగిపోతుందా ఏమిటి?" ఓ ప్రభుత్వ ఉద్యోగి.

"పిల్లికి బిచ్చం పెట్టడండి బాబూ! రకరకాల వాళ్లు చందాల కోసమని వస్తుంటారు కదా! కసురుకొని మరీ పంపిస్తాడు, కరుణ లేని కరం కావాలని వినిపించుకోని కర్ణం, మిలటరీలో పనిచేసిన మనిషి కదా!" ఓ బుర్రమీసాలాయన.

ఆ ప్రాసతో కూడిన వ్యంగ్యానికి అందరూ చప్పట్లు కొట్టారు.

వెంటనే వాచ్‌మాన్ అందుకున్నాడు "మొన్నటికి మొన్న మా చంటిదాని పుట్టినరోజు కదా అని ఒక గౌను కొనిద్దామని తమరందరినీ అడిగినట్లే ఆయన్ని కూడా డబ్బులడిగానండి! చాక్లెట్ ఒకటి దాని నోట్లో పెట్టి, అదేంటి.. ఆ..! గాడ్ బ్లెస్ యూ అనేసి ఇంకేమీ ఇవ్వకుండా వెళ్లిపోయాడండి."

"ఇలాంటి వ్యక్తికి ఫ్లాటు అద్దెకిచ్చినందుకు ఆ ఓనరుని అనాలి" మళ్లీ బట్టతల పెద్దమనిషి.

"మిలటరీలో మేజర్‌గా చేసి రిటైర్ అయ్యాడట కదా! ఆ దర్జా దర్పం చూసి ఇచ్చి ఉంటాడు" బుర్రమీసాలాయన.

"ఓ పెళ్లామా పిల్లలా? ఒంటికాయ సొంఠి కొమ్ము! మా పక్క వాకిలనే గానీ మాట్లాడటానికి అద దిక్కన్నా లేదు" లావుపాటి గృహిణి.

"రోజూ అందరి వాకిళ్ల ముందు ఊడుస్తుంటానా, పండక్కి పబ్బానికి ఒక్క పది రూపాయలైనా చేతిలో పెట్టెరుగడు" వాచ్‌మాన్ భార్య.

"అబ్బబ్బా చాల్లెండి! ఆయన నామస్మరణ! మీటింగ్ అయిపోయిందిగా! ఇక వెళదాం పదండి" ఓ వృద్ధ ఓనరు.

అందరూ ఎవరి ఫ్లాట్స్‌కి వాళ్లు వెళ్లిపోయారు.

అనుకున్నట్లుగానే డిసెంబర్ 31 రాత్రి ఎనిమిది గంటలకు పార్టీ ప్రారంభం అయింది. గ్రౌండ్ ఫ్లోర్‌లోని వాహనాలన్నీ పక్కకు జరిపి ఒక స్టేజీ ఏర్పాటు చేశారు. పిల్లలు కొత్త సినిమా పాటలకు డాన్సులేశారు. వాళ్ల తల్లిదండ్రులు తెగ మురిసిపోయారు. ఆడవాళ్లకు మ్యూజికల్ చెయిర్ పెట్టారు, లావుపాటి గృహిణి ఫస్ట్! పాటల పోటీ పెట్టారు, ఫ్రెంచ్ గడ్డమాయన బెస్ట్.

భోజనాల కార్యక్రమం కూడా దిగ్విజయంగా ముగిసింది.

సరిగ్గా రాత్రి పన్నెండు గంటలు దాటగానే 'హేపీ న్యూ ఇయర్' అంటూ అందరూ కేకలు, షేక్‌హేండ్స్, ఆలింగనాలు... ఎవరో బాణసంచా కూడా కాల్చారు.

ఎక్కడికో వెళ్లి అప్పుడే వచ్చిన కరుణాకరం అందరిని ఉద్దేశించి "హేపీ న్యూ ఇయర్ టు ఆలాఫ్ యూ" అంటూ లోపలకు వెళ్లిపోయాడు. ఆయన మాటలు విన్నారో లేదో అన్నట్లు అందరూ కేకలు కేరింతల్లో నిమగ్నమైపోయారు.

తెల్లవారింది.

రాత్రి ఆలస్యంగా పడుకోవడం వల్ల ఫ్లాట్స్‌లో ఎక్కడో ఒకరిద్దరు తప్ప అందరూ నిద్రమత్తు వీడలేదు. వాచ్‌మాన్ అతని భార్య రాత్రి పార్టీ తాలూకు మిగిలిపోయిన చెత్త చెదారం ఊడుస్తున్నారు. హఠాత్తుగా ఆ...! అని మూలుగుతూ వాచ్‌మాన్ కింద పడిపోయాడు.

వాచ్‌మాన్ భార్య వెంటనే అతన్ని పట్టుకొని కింద పడుకోబెట్టి పెద్దపెద్దగా "అయ్యో! ఎవరైనా రండి బాబూ! నా పెనిమిటికేదో అయింది! త్వరగా రండి బాబూ!" అని గుండెలు [illegible]దుకుంటూ కేకలు పెడుతున్నది.

నిమిషాల్లో అందరూ అక్కడకి చేరుకున్నారు. ఎవరో ఆటోని పిలిచారు. మరెవరో వాచ్‌మాన్‌ని లోపలికి ఎక్కించి, అతని భార్యను కూడా ఎక్కమని దగ్గరలోని హాస్పిటల్‌కి పంపించారు.

* * *

సాయంత్రం అసోసియేషన్ అత్యవసర సమావేశం ఏర్పాటయింది. అందరూ గంభీర వదనాలతో కూర్చున్నారు. బుర్ర మీసాలాయన నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ "బైపాస్ సర్జరీ అంటే లక్షల్లో ఖర్చు!" అన్నాడు.

"నిన్ననే కదండీ! పార్టీకని అందరం తలా అయిదు వందలు వేసుకున్నాం! మళ్లీ ఎక్కడ నుండి తేవాలి? అసలే చాలీచాలని జీతాలమీద బ్రతికే వాళ్లం" రెండు జేబులు షర్టు వేసుకున్న ప్రభుత్వ ఉద్యోగి.

"పోనీ ఒక పని చేద్దాం! టీవీలో పేపర్లో ప్రకటన ఇస్తే సహాయం కావాలని?" బట్టతల సలహా.

అప్పటిదాకా చేతులు కట్టుకుని అక్కడ నిలబడి ఉన్న వాచ్‌మాన్ భార్య "బాబ్బాబూ! అంత టయము లేదు. గవర్నమెంటు వారి సాయం కొంత వస్తుందని ఒక పెద్దమనిషి చెప్పాడు. ఆసుపత్రి వాళ్లు కూడా కొంత ఫీజు తగ్గిస్తామన్నారు. అయినా పరీక్షలకీ మందులకీ మరికొన్ని ఖర్చులకి వెంటనే యాభై వేలు కట్టితీరాలన్నారు. మీరే ఎలాగైనా సాయం చేయాలి! చచ్చి మీ కడుపున పుడతా! జీవితాంతం ఇక్కడే ఊడిగం చేసుకు బతుకుతాం! నా పెనిమిటిని కాపాడండి బాబూ నేను ఆసుపత్రికెళ్లి మళ్లీ వస్తా బాబూ!" అంటూ అక్కడి నుండి రోదిస్తూ వెళ్లింది.

అంతలో అక్కడికొక వ్యాన్ వచ్చి ఆగింది. అందరూ చూస్తుండగానే అరగంటలో సామానంతా వ్యాన్లోకి ఎక్కించేసి సెక్రటరీ దగ్గరకు వచ్చిన కరుణా

కరం "సెక్రటరీగారూ! నేను అనుకోకుండా వేరే ఊరికి మారవలసి వచ్చింది. ఇవిగోండి నా ఫ్లాట్ తాళాలు, మా ఓనరుగారు మీకిచ్చి వెళ్లమన్నారు" అని చెప్పి మోటార్ సైకిల్‌పై వ్యానుని అనుసరిస్తూ వెళ్లిపోయాడు.

సెక్రటరీతో సహా అందరూ నోరెళ్లబెట్టి చూస్తున్నారు. "చూశారా ఎలాంటి మనిషో! అందరం ఇంత పెద్ద సమస్యతో తలలు పట్టుకొని కూర్చుని ఉంటే, ఇలాంటి సమయంలో ఇల్లు ఖాళీ చేసి వెళతాడా? మొత్తానికి మిలిటరీ హృదయమని నిరూపించాడు" ఫ్రెంచ్‌గడ్డం పెద్ద మనిషి ఆవేదన.

* * *

ఆపరేషన్ థియేటర్ నుండి బయటకు వచ్చిన డాక్టరు దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చింది వాచ్‌మాన్ భార్య. ఆమెతో పాటు అపార్టుమెంట్ ఓనర్స్ అంతా అక్కడకు వచ్చారు.

"మరేం భయం లేదమ్మా! ఆపరేషన్ బాగా జరిగింది. కానీ మీరెవ్వరవా ఇప్పుడు పేషెంట్‌ని చూడటానికి వీల్లేదు, రేపు చూడొచ్చు" అన్నాడు.

"డాక్టరుగారూ! ఆపరేషన్‌కి డబ్బెవరు సర్దుబాటు చేశారు? వాచ్‌మాన్ భార్యకు కూడా తెలియదంటున్నది?" అడిగాడు సెక్రటరీ.

"అతనెవరో చూడబోతే మిలటరీ వ్యక్తిలా ఉన్నాడు. డబ్బు కౌంటరులో కట్టేశాను. ఆపరేషన్ జాగ్రత్తగా చెయ్యండి అని చెప్పి, ఆపరేషన్ తరువాత చూడ్డానికి వచ్చిన వాళ్లకి ఇదుగో ఈ లెటర్ ఇవ్వమన్నాడు" అంటూ జేబులో నుంచి ఒక కవరు తీసి ఇచ్చాడు. సెక్రటరీగారు అందులోని కాగితం తీసి పైకి చదివారు.

"నా కరానికి అనవసర దానాలు చేయడం తెలియదు. అందుకే ఇంతకాలం మీకు పిసినారిగా కనపడ్డాను. నా కర్ణానికి పొగడ్తలు, కృతజ్ఞతలు వినడం ఇష్టం ఉండదు. అందుకే ఇకపై అక్కడ ఉండటం ఇష్టం లేక కొత్తచోటుకి వెళ్లిపోతున్నాను."

అందరి ముఖాలు ఒకరినొకరు చూసుకొని సిగ్గుతో తలలు వంచుకున్నారు. వాచ్‌మాన్ భార్య కృతజ్ఞతతో చేతులు జోడించి అక్కడ లేని అతనికి నమస్కరిస్తోంది.

